చిన్న కథానిక

# విశ్వంగాడి ప్రేమ తెర X

రచన !
శ్రీ బొడ్డుపల్లి కృష్ణావధాని

ఒకానొక శుభముహూర్తాన మా విశ్వంగాడు రొప్పుతూ వచ్చి-

'ఒరేయ్! కాఫీకి పోదాంరా! అన్నాడు.

'ఏమిటిరా గిరాకీ' అన్నాను,

'ముందు కదులు చెప్తాను' అన్నాడు.

'తప్పుతుందా నడు' అంటూ లేచాను.

కాఫీ త్రాగిన తరువాత చెప్పాడు.

'ఒరేయ్ నేనా లీలావతిని ప్రేమించానురా ఇంక ఆ అమ్మాయిని తప్ప ఇంకెవర్నీ పెళ్ళిచేసుకోను' అన్నాడు.

'లీ లా వ తి ఎవరురా! రాక్షసకుమారా హిరణ్యకశిపా' అన్నాను నవ్వుతూ.

నీ వెరగవులేరా వాళ్ల నాన్న తాలూకాఫీసులో పనిచేస్తూవుంటాడు ఉఁ. అని అన్నాడు విశ్వం.

'అహా...'అని మౌనంగా ఊరుకున్నాను.

'ఆ అమ్మాయి, నేను రోజూ ఆదోవన వెళ్ళేటప్పుడు చూచి నవ్వేది. అయినా నేను పట్టించుకోనట్లుగా వెళ్ళేవాణ్ణి. అలా ఐదు సార్లు నవ్వింది' అన్నాడు.

నీ ఆకారం (?) చూచి అలా నవ్వాలనిపించిందేమో' నన్నాను.

చాఛా! కాదురా ఇంకా ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదట. ఎటూ మావాళ్ళు నాకు పెళ్ళిచేయాలనుకుంటున్నారుగా ఆ బీదపిల్లని చేసుకుని సంస్కర్తని అనిపించుకోవాలని ఉంది నీవేమంటావు అన్నాడు.

నాకు పచ్చివెలక్కాయ అడ్డంపడ్డంత పని జరిగింది. నెమ్మదిగా తేరుకొని-

'అవరా. అవు సంస్కర్తవే అవు. కాని నీ సంస్కరణ పాపమా బీదపిల్లమీద ఎందుకు? అయినా ఇలా ఎన్నిమార్లు నీవు సంస్కరణలు చేయలేదు. తల్లి తండ్రిలేని అనాధ రమాదేవిని సంస్కరిస్తానన్నావు, వారం తిరగకుండా చచ్చింది. ఆస్తిలేని రాఘవమ్మను సంస్కరిస్తానన్నావు. 'చేసుకుంటే మూడోనాడే విడాకులివ్వాల్సివచ్చేది రోయ్' (కారణం గవ్వకన్నా లెండీ అమ్మాయిది)' అంటూ వచ్చావు నీ ప్రేమకు వీళ్ళందర్ని ఎందుకురా బలియ్యటం. పెళ్ళి చేసుకుంటానంటూ ప్రతిపిల్లనూ వీరా వాళ్ళ ప్రమేయం లేకుండా చూస్తుంటావు' అన్నాను.

'అలా కాదురా. ఈ అమ్మాయిని చేసుకుంటానని మా అమ్మా నాన్నకు ఇవాళే చెప్తాను' అంటూ వెళ్ళాడు విశ్వం.

విశ్వం నాలుగు రోజులవరకు కనబడలేదు. ఐదవరోజున కనబడ్డాడు.

'ఏరా చిట్టి! నీ వి వా హం ఎంతవరకు దొర్లింది' అన్నాను వాడి మొహం చిన్నపోయింది.

'ఏం ఎగతాళి చేస్తావు లేరా! నా బ్రతుకంతా ఎగతాళి పంచాంగం అయిపోయింది.' అన్నాడు ఖిన్నుడయి.

'అదిగాదురా! అసలేం జరిగింది.

'ఏముంది! ఆ రోజు నీతో మాటాడిన తరువాత లీలావతి వాళ్ళింటికి వెళ్ళాము నేను మా నాన్న. అసలు మా నాన్న నే చస్తానని బెదిరిస్తే కదిలాడు. తీరా వెళ్ళివాళ్ళ అమ్మాయిని నాకిచ్చి పెళ్లిచేయమని మా నాన్న వాళ్ళని అడిగితే-అడిగితే' అంటూ నాన్చాడు,

'అడిగితే, కసురుకుని, వాళ్ళ అమ్మాయి పిచ్చిదని, ఎవరినిచూచినా అలాగే నవ్వుతుందని, పిలుస్తుందని పైగా అడిగితే పెళ్లిచేసుకుంటానంటుందని చెప్పాడు. పైగా బాలవితంతువట. వితంతువైనప్పటినుంచి పిచ్చి ఎక్కిందట' అన్నాడు.

'నీకీ ప్రేమతెరలేమిటిరా అప్పుడప్పుడు? అలాగే ఆ అమ్మాయికి కూడ పిచ్చి ఏమో' అన్నాను.

